

ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
## ఉమ్మడి నల్గొండ జిల్లా
శుక్రవారం 01-05-2026 పేజీలు :08

## వేసవిలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మునగాల, ఏప్రిల్30 (విజన్ ఆంధ్ర):**



వేసవి కాలంలో దొంగతనాల ప్రమాదం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునగాల ఎస్ఐ. ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ వేసవిలో దొంగతనాలు ఎక్కువ జరిగే అవకాశం ఉన్నందున రైతులు మోటార్లు, కేబులు పశువుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. పిల్లలు ఈత కోసం బావులు,కాలువా లకు వెళ్ల కుండాజాగర్త వహిచాలని, ముఖ్యంగా పగటి వేళల్లో ఇళ్లలో ఎవరూ లేకపోవడం, రాత్రిళ్లు బయట నిద్రించడం వంటి పరిస్థితులను దొంగలు అవకాశంగా తీసుకునే అవకాశం ఉంది.ఇళ్లకు బలమైన తాళాలు వేసుకోవడం, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం అవసరం. అపరిచితులకు ఇళ్ల వివరాలు చెప్పకూడదు. విలువైన ఆభరణాలు, నగదు వంటి వాటిని భద్రంగా ఉంచుకోవాలిపక్కింటివారితో పరస్పర సహకారం పెంచుకుని, ఎవరైనా కొత్తగా తిరుగుతూ ఉంటే గమనించాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలను అరికట్టవచ్చు.ప్రజల సహకారంతోనే దొంగతనాలను తగ్గించగలమని, అప్రమత్తతే రక్షణ అని అన్నారు.

## ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడియల్ తరగతులు నిర్వహిస్తాం

### జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



**ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30,(విజన్ ఆంధ్ర)** ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించేందుకు రెమిడియల్ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ , రాష్ట్ర వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణకు తెలియజే సారు.గురువారం రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణా హైద్రాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు,జిల్లా విద్య, ఇంటర్ విద్యా శాఖ అధికారులతో ఇంటర్,పదవతరగతి ఫలితాలుఅమ్మ ఆదర్శ పాఠశాల పనులు, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు,రేమిడియల్ తరగతులను జిల్లా కలెక్టర్ ప్రిన్సిపల్ సెక్రటరీ కి వివరిస్తు నల్గొండ జిల్లాలో 15 ఇంటర్ కళాశాలలు ఉన్నాయని, మొదటి,రెండవ సంవత్సరాల పరీక్షలు రాసిన విద్యార్థులలో 1982 మంది ఫెయిల్ అయ్యారని, వారికి ఏప్రిల్ 18 నుండే హాఫ్ లైన్ లో రేమిడియల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సప్లమెంటరీ పరీక్షలలో వారు ఉత్తీర్ణులయ్యేలా కృషి చేస్తున్నామని తెలిపారు.అంతకుముందు ప్రిన్సిపాల్ సెక్రటరీ పాఠశాల టాయిలెట్లు,ఇతర చిన్న చిన్న మరమ్మతులు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై సమీక్షించారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దశ్రు నాయక్,ఈ డబ్ల్యు ఐడిసి ఎస్ ఈ బలప్రసాద్,డి ఈ ఓ భిక్షపతి, తదితరులు హాజరయ్యారు.

## మైనర్ బాలికపైఅత్యాచారయత్నం కేసులో నిందితుడికి 7 ఏళ్ల జైలు శిక్ష

### నల్గొండ పోక్సో కోర్టు తీర్పు

**నిందితుడు ఉప్పుతల దుర్గాప్రసాద్‌కు రూ.4,000 జరిమానా**

**బాధిత 14 ఏళ్ల బాలికకు రూ.2 లక్షల పరిహారం**

**ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర)**



మైనర్లపై నేరాలకు కఠిన శిక్షలు తప్పవని నల్గొండ పోక్సో న్యాయస్థానం మరోసారి స్పష్టం చేసింది.మైనర్ బాలికపై అత్యాచారయత్నం కేసులో నిందితుడు ఉప్పుతల దుర్గాప్రసాద్‌కు 7 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది.నిందితుడికి రూ.4,000 జరిమానాతో పాటు బాధిత 14 ఏళ్ల బాలికకు రూ.2 లక్షల పరిహారం ప్రకటించింది.ఘటన వివరాలు..20 ఏప్రిల్ 2018న నార్కట్‌పల్లి మండలం కొండపాకొనిగూడెంలో సవతి తండ్రి అయిన దుర్గాప్రసాద్ మృగంలా మారి బాలికను తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు.బాలిక కేకలు వేయడంతో నిందితుడు నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుంది.21 ఏప్రిల్ 2018న నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది.పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.సుదీర్ఘ విచారణ అనంతరం నల్గొండ జిల్లా పోక్సో న్యాయస్థానం గురువారం నిందితుడిని దోషిగా తేల్చి శిక్ష ఖరారు చేసింది.

## చలివేంద్రం ఏర్పాటు




**నూతనకల్, ఏప్రిల్ 30(విజన్ ఆంధ్ర):**

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రయాణికుల దాహార్తిని తెచ్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల అభివృద్ధి అధికారి సునీత అన్నారు. గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.వేసవిలో ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉందని అవసరాల నిమిత్తం మండల ప్రజలు మండల కేంద్రానికి వచ్చి వెళుతూ ఉంటారని వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఇంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్,ఉపసర్పంచ్ నాగం సరిత సుధీర్ రెడ్డి,ఎంపీఓ శశికళ,నాయకులు కాప రవికుమార్,ఉప్పుల వీరు యాదవ్, నవీన్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి,పంచాయతీ కారోబార్ శంబయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై కలెక్టర్ పరిశీలన

### గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**గుండాల, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర):**

గుండాల మండలం అనంతారం గ్రామంలో జిల్లా కలెక్టర్ శ్రీ అనురాగ జయంతి పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను సమీక్షించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇండ్ల సంఖ్య, వాటి ప్రస్తుత దశలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తి అయిన ఇండ్లకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు జమయ్యాయా అని విచారించారు.ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి లబ్ధిదారులు త్వరగా గృహప్రవేశాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా అధికారులు పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల సంఖ్య,అందులో చదువుతున్న చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హై స్కూల్ పరిధిలో కొత్త అంగన్వాడీ గది నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామంలోని రెండు అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీ స్త్రీల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆశా వర్కర్లను ప్రశ్నించారు. గర్భిణీలు రెగ్యులర్‌గా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రసవాలు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా చూడాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణీ స్త్రీల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న



పోషకాహారం తీసుకుంటున్నారా అని విచారించి, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు.ఇటీవల భర్తను కోల్పోయిన గర్భిణీ స్త్రీ ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించిన కలెక్టర్,ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకుని ఆర్థిక సమస్యల పరిష్కారానికి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.అవసరమైతే ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్ హరికృష్ణ ఎంపిడిఓ చండీరాణి సర్పంచ్ వినోద్ కుమార్ ఉప సర్పంచ్ సంపత్ అగ్రికల్చర్ ఏవో సూరజ్ కుమార్ మిషన్ పిఎసిఎస్ఈఓ నాగయ్య మిషన్ భగీరథ ఎఈ ఆనంద్ ఆర్ఐ ప్రభుదాస్ అగ్రికల్చర్ ఎఈఓ శ్వేత సర్వేయర్ సుష్మా ఏడబ్ల్యుటి స్వప్న జీపీవో సైదులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ల పంపిణీలో జాప్యం వృద్ధులు, వికలాంగుల అవస్థలు

**హుజూర్ నగర్ మే 01 (విజన్ ఆంధ్ర ):**



"దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుకున్నట్టు" ఉంది హుజూర్ నగర్ లో ఆసరాపెన్షన్ల పరిస్థితిఅని పట్టణ వికలాంగుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 25వ తేదీనే పెన్షన్లకు సంబంధించిన బడ్జెట్ విడుదలైనప్పటికీ, నేడు 30వ తేదీ వచ్చినప్పటికీ లబ్ధిదారులకు పెన్షన్లు అందకపోవడంపై వారు మండిపడ్డారు.ఈ సందర్భంగా పట్టణ వికలాంగుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. బడ్జెట్ విడుదలై ఐదు రోజులు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పోస్ట్ ఆఫీస్ సిబ్బందితక్షణమే స్పందించి, పెన్షన్ల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలనివారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పట్టణ వికలాంగుల సంఘం నాయకులు ఇందిరాల పిచ్చయ్య రజక, కాలం శ్రీను, పొనుగుపాటి లక్ష్మణరావు, రూపారాణి, బ్రహ్మం, చారి, తారాభీ, నాగిరెడ్డిపాల్గొన్నారు.

## కేశవాపురంలో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించిన సర్పంచ్ గోసుల రాజేష్

**నడిగూడెం, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర):**



చెన్నకేశవపురం గ్రామంలో ఖమ్మం శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించబడింది. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గోసుల రాజేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా శిబిరంలో 100 మందికి పైగా గ్రామస్థులకు ఉచితంగా కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించారు.అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అత్యవసరంగా ఆపరేషన్ అవసరమైన 10 మందిని గుర్తించి, వారికి రేపు ఖమ్మంలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే మాక్స్ విజన్ హాస్పిటల్స్ సిబ్బంది, అసిస్టెంట్ డాక్టర్, క్యాంపు కోఆర్డినేటర్ దేవేందర్, శ్రీకాంత్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సైగా ఎం శోభన్ బాబు బాధ్యతలు స్వీకరణ

**గుండాల ఏప్రిల్ 30(విజన్ ఆంధ్ర):**



ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడానికి కృషి చేస్తానని నూతన ఎస్సై ఎం శోభన్ బాబు తెలిపారు. గుండాల మండల నూతన ఎస్సైగా ఎం శోభన్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నల్గొండ జిల్లాలో ఎస్సైగా పనిచేస్తూ గుండాలకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్సై గా పనిచేస్తున్న ఎస్సై ఎం తేజంరెడ్డి నల్లగొండ జిల్లా కు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న ఎస్సై ఎం తేజంరెడ్డి ను పోలీస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. నూతన ఎస్సై గా బాధ్యతలు స్వీకరించిన ఎం శోభన్ బాబు మాట్లాడుతూ..మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడానికి కృషి చేస్తానని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.మండలంలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్న నేరుగా పోలీసు స్టేషన్ లో సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై కు పోలీసు సిబ్బంది ఘనంగా సత్కరించారు.

## కార్మిక హక్కుల పరిరక్షణకు మేడేను దీక్షా దినంగా పాటిద్దాం

**తుంగతుర్తి, ఏప్రిల్ 30 ( విజన్ ఆంధ్ర ):**



తుంగతుర్తి మండల కేంద్రంలో 140వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా టి.యు.సి.ఐ (ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టి.యు.సి.ఐ జిల్లా కమిటీ సభ్యులు మామిడి సుధాకర్ మాట్లాడుతూ, మేడేను కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ దినంగా పాటించాలని పిలుపునిచ్చారు. సుమారు 140 సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగోలో కార్మికులు పని గంటల తగ్గింపు, వెట్టిచాకిరి నిర్మూలన కోసం పోరాడి తమ రక్తాన్ని చిందించి హక్కులు సాధించుకున్నారని ఆయన గుర్తు చేశారు. ఎనిమిది గంటల పని, ఎనిమిది గంటల విశ్రాంతి, ఎనిమిది గంటల కుటుంబానికి కేటాయించే హక్కులను సాధించడం కార్మిక ఉద్యమ చరిత్రలో గొప్ప మైలురాయిగా నిలిచిందన్నారు.ప్రస్తుతం దేశంలో అదే హక్కుల కోసం మళ్లీ పోరాటం అవసరమైందని సుధాకర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ చట్టాల ద్వారా పాత 27 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులకు నష్టం కలిగిస్తోందని ఆరోపించారు. ఈ విధానాలు కార్మిక వ్యతిరేకంగా, కార్పొరేట్ అనుకూలంగా ఉన్నాయని విమర్శించారు. అదేవిధంగా అంతర్జాతీయ యుద్ధ భయాందోళనలను చూపిస్తూ సామాన్య ప్రజలపై ధరల భారాన్ని మోపుతున్నారని ఆయన ఆరోపించారు.అందువల్ల మేడేను కార్మిక వర్గ దీక్ష దినంగా నిర్వహిస్తూ, నాలుగు లేబర్ కోడ్ చట్టాల రద్దు కోసం, యుద్ధ బారాలకు వ్యతిరేకంగా పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.గ్రామ గ్రామాన ఎర్రజెండాలను ఎగురవేసి కార్మిక పోరాట స్ఫూర్తిని నిలబెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యులు ఏర్పుల లక్ష్మన్న, టి.యు.సి.ఐ డివిజన్ అధ్యక్షులు దర్శనం రమేష్, నాయకులు మజ్జిగ వెంకటేష్, శ్రీను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు గుడ్ న్యూస్ నేటి నుంచి కొత్త అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ కలెక్టర్లకు కీలక ఆదేశాలు..

**ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర):**




తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. మే 1 నుంచి 10లోపు అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పష్టం చేసింది.2022-2024 సంవత్సరాలకుగాను గతంలోజారీచేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈనెల 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో జర్నలిస్టులకు ఇబ్బంది కలగకుండా కొత్త కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కలెక్టర్లకు కీలక ఆదేశాలు..**

సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ఏప్రిల్ 28న నిర్వహించిన సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు, స్పెషల్ కమిషనర్ జి.ముకుంద రెడ్డిఅన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి జిల్లాలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటి సమావేశాలను ఏప్రిల్ 30లోపు పూర్తి చేయాలని తెలిపారు. ఆయా అక్రిడిటేషన్ కమిటీల ఆమోదం పొందిన అర్హులైన జర్నలిస్టులకు మే 1 నుంచి మే 10లోపు అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ప్రభుత్వానికి నివేదికను పంపాలని కలెక్టర్లకు సమాచారం అందించారు. ఈ మేరకు జిల్లా పౌర సంబంధాల అధికారులు (ఇూ=ూం) తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగాఉన్న వేలాదిమంది జర్నలిస్టులకులబ్ధి చేకూరనుంది.

## దొంగల బెడదపై అప్రమత్తత అవసరం ఎస్సై జి. అజయ్ కుమార్

**నడిగూడెం, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర):**



వేసవికాలం ప్రారంభమవ్వడంతో దొంగతనాల ప్రమాదం పెరిగే అవకాశంఉన్నందున రైతులు,గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నడిగూడెం మండల ఎస్సై జి. అజయ్ కుమార్ సూచించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన పలు ముఖ్య సూచనలు చేశారు.రైతులు పొలాల్లో ఉన్న మోటర్లు, విద్యుత్ వైర్లు, పైపులు వంటి విలువైన వస్తువులను నిర్లక్ష్యంగా వదిలేయకుండా ఇంటి వద్ద భద్రపరచుకోవాలని సూచించారు. అలాగే పశువుల దొంగతనాలు కూడా ఈ కాలంలో ఎక్కువగా జరిగే అవకాశముండడంతో రైతులు తమ పశువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హెచ్చరించారు.ఇక తల్లిదండ్రులు పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని ఎస్సై పేర్కొన్నారు. వేసవి కాలంలో పిల్లలు సరదాగా ఈత కొట్టేందుకు బావులు, చెరువులు, కాలువల వద్దకు వెళ్లే అవకాశం ఉన్నందున అలాంటి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని చెప్పారు.గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కనిపించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉంటేనే దొంగతనాలను అరికట్టవచ్చని ఎస్సై జి. అజయ్ కుమార్ స్పష్టం చేశారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

**ఎండ తీవ్రతలో కూలీలకు ఉపశమనం కలిగించే కార్యక్రమం**

**గరిడేపల్లి. ఏప్రిల్ 30 విజన్ ఆంధ్ర:**



గరిడేపల్లి మండలం కోదండరామపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఒగ్గు వెంకన్న (4వ వార్డు మెంబర్) సహకారంతో సర్పంచ్ మచ్చ ముత్తమ్మ (మురళి), వైస్ సర్పంచ్ వెన్న శ్రీనివాస్ రెడ్డి, ఏపీఓ రాయికింది సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మచ్చ సుధాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఏపీఓ రాయికింది సురేష్ మాట్లాడుతూ ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడం వల్ల వారికి ఎంతో ఉపశమనం కలుగుతుందని తెలిపారు. యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందదాయకమని అన్నారు. ఉపాధి కూలీలు పనులకు హాజరయ్యేటప్పుడు నెత్తిపై టవల్ ధరించడం, తగినంత నీరు తాగడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో రాజు, సుధీర్ రెడ్డి నలబోలు, మేటు మంద అశోక్, తుంగతుర్తి రాఘవేంద్ర, ఉపాధిహామీ కూలీలు గ్రామప్రజలు పాల్గొన్నారు.

## ఆలయ భూముల కౌలుకు బహిరంగ వేలం

**వలిగొండ, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర):**



మండల పరిధిలోని వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానమునకు సంబంధించిన వ్యవసాయ భూములను 2026-27.2027-28 రెండు సంవత్సరాలకు మే 4వ తేదీ సోమవారం రోజున ఉ.10.00 గం.లకు శ్రీ మత్స్యగిరిగుట్ట దేవాలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు గ్రామస్తుల ఆధ్వర్యంలో బహిరంగ వేలం ద్వారా కౌలుకు ఇచ్చుటకు నోటీసులు విడుదల చేశారు కౌలుదారులు వేలంపాటలో పాల్గొనేందుకు నిర్దేశిత డిపాజిట్ రూ 5000/లు చెల్లించి వేలంలో ఆసక్తి ఉన్న గ్రామస్తులు భక్తులు అందరూ పాల్గొనవచ్చని దేవాదాయ శాఖ ఈవో సల్వాద్రి మోహన్ బాబు తెలిపారు.

## వధూవరులను శుభాకాంక్షలు

బీబీనగర్, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర)



పడమటి సోమారం గ్రామ సర్పంచి శ్రీ బద్దం లలిత - అంజయ్య ల కుమార్తె మనీష - బాస్కర్ ల వివాహనికి హజరై ,నూతన వధూవరులను ఆశీర్వ దించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి ..ఈ కార్యక్రమంలో రాజు అల్వా మోహన్ రెడ్డి , ఉపసర్పంచు ప్రదీప్ గౌడ్ ,గండు రమేశ్ యాదవ్ ,కట్ట రాజేందర్ ,సురెష్ ,మణికంఠ పాల్గొన్నారు.

## ఎస్ఎస్సి ఫలితాల్లో మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్ధుల ప్రభంజనం

చిలుకూరు, ఏప్రిల్ 30:( విజన్ ఆంధ్ర ):





స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల చిలుకూరు బాయ్స్ పాఠశాల విద్యార్థులు ఎస్ఎస్సి ఫలితాలలో మంచి మార్కులు పొంది చిలుకూరు మండల టాపర్ ఉస్కూల్ టాపర్ గా కె.కరుణాకర్ 578, బి పవన్ 576 నిలిచారు,అదేవిధంగా 8 మంది 550 మార్కులు, 41 మంది విద్యార్థులకు 500 పైగా మార్కులు సాధించడం జరిగిందని తెలిపారు.మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ శోభారాణి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎం జె పి గురుకుల విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. విద్యార్థుల యొక్క సృజనాత్మ కతను పెంపొందించేవి గురుకులాలు అని అన్నారు. ఈ విజయానికి సహకరించిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు విద్యార్థులకు, మా విజయాల్లో తోడ్పాటున అందిస్తున్న తల్లిదండ్రులకు అభినందనలు తెల పడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏటిపి రామకృష్ణ, ఉపాధ్యాయులు గురు స్వామి, రవి, అరుణ్ కుమార్, వీరయ్య, ఉపేందర్ ,సాలయ్య, బ్రహ్మ చారి ,మధు, వీరబాబు, కోటయ్య , జానీ , రాజేష్ ,స్వాతి, శిరీష, రజినీ పాల్గొన్నారు.

## మంగ్త మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు

మిర్యాలగూడ, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర)




మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు జంక్షన్ వద్ద బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కేశవ డాబా సమీపంలో కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొనడంతో మైసమ్మకుంట తండాకు చెందిన మెగావత్ మంగ్తా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మంగ్తా మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తక్షణ సాయం కింద 10,000 రూపాయల ఆర్థిక సాయం చేశారు, ఈ దారుణ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, కుటుంబానికి న్యాయం జరగాలని,ఇలాంటి ప్రమాదాలు మరల జరగకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు స్పష్టం చేశారు.వారి వెంట మాజీ అగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, దానవత్ చిట్టిబాబు నాయక్, సర్పంచ్ వెంకటేశ్వర్లు,రాందాస్, జటావత్ వినోద్ నాయక్, మలోతు రవీందర్ నాయక్, , కూర్య, శీను, రవి, తదితరులు ఉన్నారు.

## మండలంలో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పర్యటన..

### వరుస వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరుల ఆశీర్వాదం

పెన్ పహాడ్, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర):



పెన్ పహాడ్ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గురువారం విస్తృతంగా పర్యటించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన పలు వివాహ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు.ముందుగా సూర్యాపేట పట్టణంలోని వెంక టేశ్వర గార్డెన్స్‌లో జరిగిన దోసపహాడ్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు సద్దాల నగేష్ గౌడ్ మేనల్లుడు మహేష్ - శ్రావణిల వివాహానికి హాజరయ్యారు.అనంతరం అనంతారం గ్రామంలో ఉప్పునూతల వెంకన్న యాదవ్ కుమారుని వివాహానికి, గూడెపుకుంట తండాలో జరిగిన సిద్దు నాయక్ - ఆర్తీక వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత జల్మాల్ కుంట తండాలో జరిగిన నరేష్ - సంధ్య వివాహ వేడుకలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తూముల భుజంగరావుతో కలిసి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.ఈ పర్యటన ముగింపులో భాగంగా మోర్సకుంట తండాకు చేరుకున్న సర్వోత్తమ్ రెడ్డి , అక్కడ జరిగిన బానోతు గోప్య కుమారుని వివాహ మహోత్సవానికి హాజరై వధూవ రులను ప్రత్యేకంగా ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో పెన్ పహాడ్ మండల పార్టీ అధ్యక్షుడు తూముల సురేష్ రావు, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, పిసిసి ఎస్సి సెల్ చైర్మన్ చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, సర్పంచులు మామిడి శోభా శ్రీనివాస్, జామ నాయక్, గుగులోతు లచ్చిరాం, అనుముల పూరి నాగయ్య, భూక్య లింగమ్మ హుస్సేన్, మార్కెట్ డైరెక్టర్ ఆర్తి కేశవులు, మేడిమేలపు దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పిన్నెని కోటేశ్వరరావు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భూక్య శివ నాయక్, పార్టీ నాయకులు కొండేటి బిక్షం రెడ్డి, గద్దల నాగరాజు,నాగు నాయక్, పడిదల రవి, నారాయణ ప్రవీణ్ రెడ్డి, చెంచల నిఖిల్, బొల్లెద్దు వినయ్ తదితర కాంగ్రెస్ ముఖ్య నాయకులు,పాల్గొన్నారు.

## నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డికి అభినందన సత్కారం

ఆలేరు ఏప్రిల్ 30, (విజన్ ఆంధ్ర):



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి,ఐఏఎస్ హోదా పొందిన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డికి యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆలేరు లోని వి.ఆర్.జూనియర్ కళాశాలలో అభినందన సభ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం అనుబంధ సాహిత్య సంస్థల ప్రతినిధులు ఇద్దరు ప్రముఖులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో మాట్లాడిన డాక్టర్ నందిని సిధారెడ్డి ఎలాంటి ఫలితం ఆశించకుండా కవి తన లక్ష్యానికి కట్టుబడి ప్రయాణం సాగించినప్పుడు ఇలాంటి గౌరవాలు మరింత బాధ్యతను పెంచుతాయని తెలిపారు.సమాజంపై నిరంతర పరిశీలనతో తన భావాలను కవిత్వ రూపంలో వ్యక్తం చేయడం కవి బాధ్యత అని పేర్కొన్నారు.డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ, తాను ఇష్టపడి అభ్యసించిన విద్యే తనను ఈ స్థాయికి చేర్చిందని,ముఖ్యంగా తెలుగు భాషా సాహిత్యం తనను కవిగా, అధికారిగా నిలబెట్టిందని చెప్పారు.జీవితాంతం కవిగానే కొనసాగాలన్నది తన అభిలాష అని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీరామోజు హరగోపాల్, అమ్మాయాది సత్యనారాయణ, డాక్టర్ లింగంపల్లి రామచంద్ర, బండిరాజుల శంకర్, అయ్యప్ప, బండారు జయశ్రీ, ఎస్.ఎన్. చారి, అభినయ శ్రీనివాస్, దేవినేని అరవిందరాయుడు, తొర్ర ఉప్పలయ్య, పోరెడ్డి రాజేశ్వరి, గుమిడెల్లి వెంకన్న,బయ్యని రాజు, మర్రి జయశ్రీ, రామ్ ప్రసాద్, మోత్కూరు సుజాత, భైరపాక స్వామి, బాలరాజు, శ్రీరామకృష్ణ విద్యాలయం ఆచార్య బృందం, జనగాం సాహితీ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

## రత్నవరంలో పౌర హక్కుల దినోత్సవం

నడిగూడెం, ఏప్రిల్ 30 ( వి జన్ ఆంధ్ర ):



మండల పరిధిలోని రత్నవరం గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన సభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దాట్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమా నికి నడిగూడెం ఎస్సై జి. అజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ మన్సూర్ అలీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, హాస్టల్ వార్డెన్ తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై అజయ్ కుమార్ మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ రచించినభారత రాజ్యాంగం ప్రతిపౌరునికి కల్పించిన ప్రాథమిక హక్కుల ప్రాముఖ్య తను వివరించారు. సమానత్వం, స్వేచ్ఛ, విద్య, రక్షణ వంటి హక్కులు ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా హక్కులతో పాటు రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వర్తించాల్సిన అవసరాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది విస్తృతంగా పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా పౌర హక్కులపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు పలు సూచనలు చేశారు.

## నూతన వధూవరులకు శుభాకాంక్షలు

బీబీనగర్, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర)



పడమటిసోమారం గ్రామ సర్పంచ్ బద్దం అంజయ్య గారి కూతురు మనీషా భాస్కర్ ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంధిగారి బసవయ్య, పడమటి సోమవారం ఉప సర్పంచ్ తంతరపల్లి ప్రదీప్, యూత్ కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షులు ఉప్పలాంచి శ్రీకాంత్, తదితరులు పాల్గొనడం జరిగింది.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

బీబీనగర్, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర)



కేపాల్ లోని డి .జి .ర్ ఫంక్షను హాల్ లో గుండెబోయిన ఇందిర - అయోధ్య యాదవ్ ల కుమార్తె శిరీష - సాయి వర్ధన్ ల వివహ వేడుకకి హజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ బీబీనగర్ మండల అధ్యక్షులు రచమల్ల శ్రీనివాస్ మండల ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్ రెడ్డి వివిధ గ్రామ సర్పంచులు కోమిరే శ్రీకాంత్ కొలను కృష్ణారెడ్డి మాజీ ఎంపీటీసీలు కడెం చంద్రశేఖర్ మంచాల రవికుమార్ నాయకులు పిట్టల అశోక్ పంజాల సతీష్ గౌడ్ అమృతం శివ గుదే శ్రీశైలం మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చీర ఐలయ్య కొండమడుగు గ్రామ శాఖ అధ్యక్షులు కనుకబోయిన రాజమల్లెష్ బిఆర్ఎస్వి యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ మున్నా, కడెం శ్రీకాంత్ తదితరులు వేడుకకు హాజరైనారు.

# ప్రభుత్వ బడి.. ప్రతిభకు నిలబడి

## పెన్‌పహాడ్ విద్యార్థుల ఘన విజయం!

పెన్ పహాడ్, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర):
ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభకు చిరునామా అని మండల కేంద్రంలోని పెన్‌పహాడ్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఈ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి, విద్యావనంలో విజేతలుగా నిలిచారు. పట్టుదల ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లోనూ అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని తమ ఫలితాలతో చాటిచెప్పారు.

**విజేతల వివరాలు..**

పాఠశాల విద్యార్థిని కొప్పు అఖిల 524 మార్కులతో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విభాగంలో అగ్రస్థానంలో నిలవగా, శ్వేత 519 మార్కులు, నీహారిక 510 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వీరితో పాటు బిస్మిల్లా (460), యాకూబ్ (460) కూడా గౌరవప్రదమైన మార్కులు సాధించి పాఠశాల కీర్తిని ఇనుమడింపజేశారు.

**కన్నుల పండువగా సన్మాన కార్యక్రమం..**

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించేందుకు పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. తమ పిల్లల ఘనతను చూసి తల్లిదండ్రులు మురిసిపోగా, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.




**గురువుల స్ఫూర్తిదాయక సందేశం..**

ఈ సందర్భంగా మండల విద్యాధికారి మరియు ప్రధానోపాధ్యాయులు నకిరేకంటి రవి మాట్లాడుతూ.. "నేటి విజేతలు రేపటి విద్యార్థులకు మార్గదర్శ కులు" అని కొనియాడారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, గ్రామానికి మరియు పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణ ప్రసాద్, రాములు, ఉపేందర్, కృష్ణయ్య, ఆనంద్ భాస్కర్, మహబూబ్ అలీ, శ్రీధర్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను దీవించారు.

## చిలుకు స్వామికి శ్రమ శక్తి అవార్డు

ఆలేరు ఏప్రిల్ 30, (విజన్ ఆంధ్ర)



యాదాద్రి జిల్లా ఆలేరు మండలం శారాజీ పేట గ్రామానికి చెందిన చిలుకు స్వామి శ్రమశక్తి అవార్డుకు ఎంపికయ్యారు.గత 14 సంవత్సరాలుగా రైల్వేలో,ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లో,పనిచేస్తూ,పలు సేవలను అందిస్తున్నారు.అంతేకాకుండా,సికింద్రాబాద్ డివిజనల్ అసిస్టెంట్ సెక్రటరీగా,42 వేల మంది కార్మికులకు సేవలందిస్తున్నారు.అనేక రకాలుగా సేవలందిస్తున్నందున,కార్మికుల దినోత్సవం మేడే ను పురస్కరించుకొని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ ల చేతుల మీదుగా ఆయన శ్రమ శక్తి అవార్డును అందుకోనున్నారు.ఈ అవార్డును అందుకోబోతున్న చిలుకు స్వామికి శారాజీ పేట గ్రామానికి చెందిన ప్రముఖులు కంతి మహేందర్ రచ్చ రామ్ నరసయ్య,మొ రిగాడి అశోక్,సిరమైన వెంకటేష్ యాదవ్ లు అభినందనలు తెలియజేశారు.

## పది ఫలితాల్లో మిర్యాలగూడ లిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర ):



పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మిర్యాలగూడలోని హౌసింగ్ బోర్డ్ లో గల లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు చక్కటి ప్రతిభ చూపి ఉత్తమ మార్కులు సాధించినట్లు కా పాఠశాల ప్రిన్సిపల్ కే.కే జయరాజన్ తెలిపారు. గురువారం లిటిల్ ఫ్లవర్ స్కూల్లో ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థులను అభినందిస్తూ మాట్లాడారు. తో పాఠశాలకు చెందిన చామకూరి తేజస్విని 600 కు 575 మార్కులను సాధించి పాఠశాల కాపరుగా నిలిచిందన్నారు. 42 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించి తమ ప్రతిభను చూపారన్నారు. నిర్దిష్టమైన ప్రణాళికతో అనుభవం తో కూడిన అధ్యాపక బృందంతో విద్యార్థులకు సృజనాత్మకమైన విద్యను అందించేందుకు మొదటినుంచి ముందుకు వెళ్లామన్నారు. పాఠ్యాంశాల వారీగా పరీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులకు తెలియజేస్తూ తొమ్మిదొంగ మార్గదర్శనం చేయడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీమతి జీన్సీ జయరాజన్, హెడ్ మాస్టర్ విజయ్ కుమార్ ఐఐటి ఇంచార్జ్ ఎరగని ప్రసాద్, ప్రైమరీ ఇన్చార్జి రాధిక తో పాటు పలువురు ఉన్నారు.

## శ్రీనిధిలో ఎలాంటి అవతకతలు జరగలేదు శ్రీ దత్తాత్రేయ సంఘ సభ్యులు

నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రతినిధి,ఏప్రిల్30(విజన్ ఆంధ్ర);



పెద్దవూర మండలం నిమ్మ నాయక్ తండ గ్రామపంచాయతీలోని శ్రీ దత్తాత్రేయ సభ్యులందరూ ఎవరు కూడా అధైర్య పడకూడదని ఎపిఎం రాందాస్ తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ దత్తాత్రేయ సంఘంలో గత నెలలో ఐదుగురు సంఘ సభ్యులకు ఐదు లక్షల చొప్పున శ్రీనిధి లోన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. మిగిలిన సభ్యులందరికీ కూడా శ్రీనిధి లోన్ రాదు అని ఎవరు చెప్పిన చెప్పుడు మాటలను నమ్మకూడదని అన్నారు.సంఘంలో ఉన్న ప్రతి ఒక్క సభ్యులకు శ్రీనిధి లోన్ తప్పకుండా వస్తుందని అన్నారు. శ్రీనిధి మీద అవగాహన లేక శ్రీనిధి లోన్ రాదేమోనని ఆందోళన చెందిన సభ్యులకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించారు.కానీ శ్రీనిధిలో ఎలాంటి అవతకతలు జరగలేదని మా సంఘం ఖాతాలో లోన్ అమౌంట్ పూర్తిస్థాయిలో పరిశీలించ మా సంఘ సభ్యులకు అవగాహన రావడం జరిగింది అన్నారు.తేదీ. 10-04-2026న గురువారం, 27-04-2026న వివిధ పత్రికలలో వచ్చిన ప్రకటన పూర్తిగా అవాస్తవమని తెలియజేస్తున్నాము.ఈ సమాచారంలో శ్రీనిధి మేనేజర్ కి,సీసీలకు ఎలాంటి సంబంధం లేదని దత్తాత్రేయ సంఘ సభ్యులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమావత్ బాబు నాయక్ గ్రామ పెద్దలు గ్రామ యువకులు గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు..

నూతనకల్, ఏప్రిల్ 30(విజన్ ఆంధ్ర)




మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రయాణికుల దాహార్తిని తెచ్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల అభివృద్ధి అధికారి సునీత అన్నారు. గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.వేసవిలో ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉందని అవసరాల నిమిత్తం మండల ప్రజలు మండల కేంద్రానికి వచ్చి వెళుతూ ఉంటారని వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఇంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్,ఉపసర్పంచ్ నాగం సరిత సుధీర్ రెడ్డి,ఎంపీఓ శశికళ,నాయకులు కాప రవికుమార్,ఉప్పుల వీరు యాదవ్,నవీన్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి,పంచాయతీ కారోబార్ శంబయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గుడి నిర్మాణానికి విరాళం

తుంగతుర్తి, ఏప్రిల్ 30 ( విజన్ ఆంధ్ర ):



సూర్యాపేట జిల్లా పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో నూతన కంఠమహేశ్వర స్వామి గుడి నిర్మాణానికి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు అనురాధ కిషన్ రావు మిల్క్ షేక్ అధినేత రాహుల్ కలిసి రూ.50,000 నగదును గుడి నిర్మాణానికి విరాళంగా అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ పెద్దలు, ఇతర ప్రముఖులు పాల్గొని గుడి నిర్మాణానికి తమ మద్దతు తెలిపారు. గ్రామంలో భక్తి వాతావరణంలో కార్యక్రమం జరిగింది.

## మధు కుటుంబాన్ని పరామర్శించేందుకు నేడు మిర్యాలగూడకు రానున్న డిప్యూటీ సీఎం

మిర్యాలగూడ, ఏప్రిల్ 30,( విజన్ ఆంధ్ర ):



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం మిర్యాలగూడ పట్టణానికి రానున్నారు. ఇటీవల సీనియర్ జర్నలిస్ట్, ఆయన వద్ద సి పి ఆర్ ఓ గా పని చేస్తున్న మారబోయిన మధుసూదన్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మధుసూదన్ ది మిర్యాలగూడ కావటంతో శుక్రవారం ఉప ముఖ్య మంత్రి వారి స్వగృహానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించనున్నట్లు అధికారిక ప్రకటన వెలు వడింది. ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పట్టణంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

## మండల వైద్యాధికారి ఆశ్రిత రెడ్డి..

నూతనకల్, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర):



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రేపు అనగా (02-05-2026న), మండల పరిధిలోని యడవల్లి గ్రామపంచాయతీ కార్యాలయం నందు సోమవారం (04-05-2026) నాడు నిక్షయ ఎక్రే వారి ఆధ్వర్యంలో నిర్వహించే క్షయ వ్యాధి సంబంధిత ఉచిత వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి ఆశ్రిత రెడ్డి కోరారు.శిబిరంలో క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షల నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ చరణ్ నాయక్,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన నియోనేటల్ ఒబెరియస్ సిస్టుకు విజయవంతమైన చికిత్స.. మలక్పేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుల ఘనత

**సూర్యాపేట ఏప్రిల్ 30:(విజన్ ఆంధ్ర):**



ఇటీవల సూర్యాపేట జిల్లాకు చెందిన గర్భావతి మహిళకు 35 వారాల మూడు రోజుల గర్భకాలంలో జన్మించిన 2.97 కిలోల బరువున్న ఒక ప్రీ టర్మ్ ఆడ శిశువుకు మలకపేట యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విజయవంతంగా అత్యాధునిక శస్త్ర చికిత్సతో అరుదైన నియోనేటల్ ఒబెరియస్ సిస్టుకు విజయవంతంగా చికిత్స నిర్వహించినట్లు మలకపేట యశోద ఆసుపత్రి వైద్యులు కన్సల్టెంట్ పీడియాట్రిక్ డాక్టర్ విక్రమ్ దంతూరి, డాక్టర్ ప్రశాంత్ బాబు కన్సల్టెంట్ నియోనే టాలజిస్ట్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని త్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గర్భాధారణ సమయం లో ఎడమ ఓవరిలో సుమారు 6 సెంటీమీటర్ల పరిమాణంలో సిస్ట్ ఉన్నట్లు గుర్తించామని నవజాత శిశువు జననం తర్వాత పరీక్షల్లో ఇది నిర్ధారించబడిందని శిశుకు యూవో లెమిక్ హైపోనాట్రిమియా ఉందని తెలిపారు. అనంతరం శిశువుకు లాప రొటమీతో పాటు ఒవేరియన్ సిస్టుకు మార్సుపియలైజేషన్ చికిత్స నిర్వహించామని పేర్కొన్నారు. మలకపేట యశోద ఆసుపత్రి డైరెక్టర్ గోరుగంటి పవన్ యూనిటీ హెడ్ కె, శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికతతో నియోనేటల్ పీడియాట్రిక్ శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించామని భవిష్యత్తులో ఇలాంటి క్లిష్ట కేసులకు ఉత్తమ వైద్యం అందించడానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మలకపేట యశోద ఆసుపత్రి సిబ్బంది ఏ, వాసుకిరణ్ రెడ్డి, వినయ్ కుమార్, రత్నాకర్, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలంటూ సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు

**మిర్యాలగూడ, ఏప్రిల్ 30,(విజన్ ఆంధ్ర ):**



డబల్ బెడ్ రూమ్ పంపిణీలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలంటూ గురువారం మిర్యాలగూడ మున్సిపాలిటి బి ఆర్ ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ఎం.డి.ఇలియాస్ ఖాన్, సీనియర్ కౌన్సిలర్ పెద్ది శ్రీనివాస గౌడ్ ల ఆధ్వర్యంలో కౌన్సిలర్లు నాయకులు ఇంచార్జ్ సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, మిర్యాలగూడ తహసిల్దార్ పి శ్రీనివాస్ లకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా అధికారులు ప్రజల సమక్షంలో లాటరీ విధానంతో ఎంపికైన డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల పేర్లను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో తొలగించటం దుర్మార్గమైన చర్య అన్నారు. అర్హత ఉన్న పేదల హక్కులనుకాలరాయటం ఎంతవరకు సమంజసం అన్నారు. అధికార దుర్వినియోగంతో పేదల జీవితాలతో ఆడుకోవడం ఆపాలన్నారు.తొలగించిన అర్హుల జాబితాను తక్షణమే పునరుద్ధరించాని,రాజకీయ ప్రేరిత నిర్ణయాలపై విచారణ జరపాలని కోరారు.నిజమైన లబ్ధిదారులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పేదల ఇళ్లపై రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. పేదలకున్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని అన్నారు.ఈ కార్యక్రమములో సందేషి అంజన్ రాజు, దీపిక విజయ్, గుడిసె జానకమ్మ దుర్గాప్రసాద్, లావుడి అరుణ సుధాకర్, మర్రి అంజి బాబు, తిరుమలగిరి వజ్రం,వడ్డేపల్లి శ్రీనివాస్, జన్నపాల సునీత కిరణ్,యర్రమల్ల దినేష్,పద్మశెట్టి లక్ష్మి కోటేశ్వర రావు, తిరంశెట్టి సీతా కోటేశ్వర రావు, గంగుల బిక్షం యాదవ్, భూక్య రాంబాబు, ఎక్కా స్వరూప మనిదీప్, ప్రేమ్ కుమార్,దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

# రెండు పూటలా ఫోటో తీసే విధానాన్ని రద్దు చేయాలి

**నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రతినిధి,ఏప్రిల్30(విజన్ ఆంధ్ర);**



ఉపాధి హామీ పనీలో హాజరు కొరకు కూలీలకు రెండు పూటలా ఫోటోలు ఇచ్చే విధానాన్ని రద్దుచేసి మాస్టర్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి కోటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సురేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను సందర్శించి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిపిజి రాంజీ బిల్లును వెంటనే ఉపసంహరించుకొని పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పనులను కొనసాగించాలని వారు కోరారు.రెండు పూటలా ఫోటో విధానం వల్ల ఫోటో మ్యాచ్ కాకుండా కూలీలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వమే 100% నిధులు కేటాయించి,సంవత్సరానికి ?200 పని కల్పించి కనీస వేతనం 800 రూపాయలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ప్రస్తుత తరుణంలో వ్యవసాయంలో పెరిగిపోయి కూలీలకు పని దొరకడం లేదని జీవనోపాధికి ఉపాధి హామీ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.వ్యవసాయ కార్మికులకు భూమిలేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 12 వేల రూపాయల హామీని అమలు చేయాలని,గ్రామాలలో పేదలకు గతంలో ప్రభుత్వం కేటాయించిన ఇళ్లస్థలాలను వెంటనే పంపిణీ చేయాలని ఆయన ఈ సందర్భంగా అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో కొండేటి సైదయ్య, తోట సీనయ్య, గోపయ్య, ఆవుల రామకృష్ణ, గురువయ్య, రాంబాబు, చంద్రకళ, అచ్చమ్మ, సరిత, లక్ష్మమ్మ, మంగమ్మ, బంగారి పాల్గొన్నారు.

# చదువుల్లో విద్యార్థులు రాణించాలి

**చిట్యాల, ఏప్రిల్ 30(విజన్ ఆంధ్ర):**



విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ దేశపాక లత రాజేష్ పిలుపునిచ్చారు.పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఉత్తీర్ణత సాధించిన 7వ వార్డు విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.
ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లత రాజేష్ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం,వారి పైచదువుల నిమిత్తం తన వంతుగా ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా లక్ష్య సాధన కోసం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అవురెండి సుందర్, ఎర్పుల నరేష్, కుక్కల వీరేష్, చిత్రగంటి నవీన్, పాల అభిషేక్, అఖిల్, ఓంకార్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

# కొప్పుల నాగిరెడ్డి మృతి బాధాకరం

**నడిగూడెం, ఏప్రిల్ 30 ( విజన్ ఆంధ్ర ):**



నడిగూడెంగ్రామానికి చెందిన కొప్పుల నాగిరెడ్డి అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ తెలిపారు. గురువారం మృతుని నివాసా నికి చేరుకుని ఆయన పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఓదార్పు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలుగూరి నాగరాజు, వార్డు సభ్యులు దున్నా లింగయ్య, గుండు మహేందర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్, నాయకులు గుండు విజయరామారావు, యలక రామిరెడ్డి, రణబోతు శ్రీనివాస్ రెడ్డి, రియాజ్, కాదాని గోపి, మీర్జా షేంషేర్ బేగ్, రణబోతు అప్పారెడ్డి, శ్రీరాముల శ్రీనివాస్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఒరిజినల్ చలాన్లు మా దగ్గరే... లైసెన్స్ మాత్రం వేరే వారికి?

## ఎక్సైజ్ వ్యవహారంలో భారీ అక్రమాల ఆరోపణలు

**కోదాడ, ఏప్రిల్ 30 (విజన్ ఆంధ్ర):**



బార్ లైసెన్స్ బదిలీ వ్యవహారం కోదాడలో సంచలనంగా మారింది. లక్షల రూపాయలు చెల్లించినప్పటికీ లైసెన్స్ తమకు దక్కలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తూ, ఎక్సైజ్ శాఖపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఘటనలో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతుండటం గమనార్హం.కోదాడ పట్టణానికి చెందిన శాఖమూరి కేశవరావు, మిర్యాల నాగేశ్వరరావు బుధవారం హైదరాబాద్‌లోని ప్రొహిబిషన్ ఛ ఎక్సైజ్ శాఖ కమిషనర్‌ను కలిసి లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. తమకు జరిగిన అన్యాయాన్ని వివరం గా తెలియజేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.85 లక్షల ఒప్పందం...రూ.42 లక్షలు చెల్లింపు బాధితుల కథనం ప్రకారం... సూర్యాపేట జిల్లా మునగాల మండలం మాధవరం గ్రామానికి చెందిన నల్లగొండ అనిత పేరిట ఉన్న 'శ్రీ చెన్నకేశవ బార్, రెస్టారెంట్' లైసెన్స్ కొనుగోలు కోసం ఈ ఏడాది జనవరిలో రూ.85 లక్షలకు ఒప్పందం కుదుర్చుకు న్నారు. అనంతరం ప్రభుత్వానికి ఉన్న బకాయిలను తీర్చేందుకు మార్చి నెలలో ఎస్‌బీఐ చలానా ద్వారా రూ.42 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. ఈ చెల్లింపు లకు సంబంధించిన ఒరిజినల్ చలాన్లు ఉన్నాయని స్పష్టం చేశారు.

**అదే చోట కొత్త బార్‌కు అనుమతులు... ఎలా?**

లైసెన్స్ తమ పేరుపైకి మారుతుందని భావిస్తున్న సమయంలో అనూహ్యంగా ట్విస్ట్ చోటుచేసుకుంది. అదే ప్రదేశంలో 'న్యూ సాయి స్వగత్ బార్ ఛ రెస్టారెంట్' పేరుతో కొత్తవారికి లైసెన్స్ జారీ చేయడం తీవ్ర వివాదానికి దారితీసింది."ఒరిజినల్ చలాన్లు మా దగ్గరే ఉన్నాయి. అవి లేకుండా అధికారులు ఎలా లైసెన్స్ మంజూరు చేశారు?" అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించబడ్డాయని వారు ఆరోపిస్తున్నారు.
"ఇది పెద్ద కుట్రే..." బాధితుల ఆవేదన..
"లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ బకాయిలు చెల్లించాం. అయినా లైసెన్స్ మాకు ఇవ్వకుండా వేరే వాళ్లతో బార్ ప్రారంభించడంలో పెద్ద కుట్ర ఉంది. అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలి.శాఖమూరి కేశవరావు, మిర్యాల నాగేశ్వరరావు.

# వైన్స్ షాప్ లో చోరీ

## -40 వేల రూపాయలు విలువైన మద్యం బాటిళ్లు చోరీ

**మునగాల ఏప్రిల్30 ( విజన్ ఆంధ్ర ):**



మునగాల మండల పరిధిలోని ఓ వైన్స్ షాపులో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. మునగాల ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బరాఖత్ గూడెం గ్రామంలోని సునీత వైన్స్ నిర్వాహకులు రోజులాగే బుధవారం రాత్రి 10గంటలకు వైన్స్ షాపును మూసివేసి ఇంటికి వెల్లిపోయారు. తిరిగి గురువారం ఉదయం 10 గంటలకు షాపును తీసి చూడగా మద్యం కాటన్లు పక్కకు జరిపి, చిందర వందరగా పడేసి ఉన్నాయి. షాపులో ఉన్న సీసీ కెమరాలను పక్కకు తిప్పి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏస్ ఐ. ప్రవీణ్ కుమార్ అక్కడికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు షాప్ పై భాగాన ఉన్న రేకును కట్ చేసి లోపలికి ప్రవేశించినట్లు సీసీ కెమెరాలో గుర్తించారు. 40 వేల రూపాయల విలువైన మద్యం బాటిల్ తొంగించినట్టు షాప్ గుమస్తా శ్రీను ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.